# సాక్షి వరంగల్

గురువారం । 17 । అక్టోబర్ । 2024






**విభజన.. విస్మరింపు**

అధికారులు, ఉద్యోగులకు పదోన్నతి, బదిలీల ప్రక్రియ కొనసాగించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. నూతన కార్యాలయాలకు స్వీపర్లు, వాచ్‌మెన్ల విభజనను విస్మరించింది. - 8లో▸



**అభివృద్ధి బాటలో పయనించాలి**

మేడారం సమ్మక్క, సారలమ్మ ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
$33^0/24^0$

**వాతావరణం**

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత ఒకటి రెండు ప్రాంతాల్లో వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### తాజా కూరగాయలు అందేలా చూడాలి



సంగెం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం కోసం తాజా కూరగాయలు అందించేందుకు రైతులను సంప్రదించాలని జెడ్పీ సీఈఓ రాంరెడ్డి సూచించారు. ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. గ్రామపంచాయతీల్లో వీధి దీపాలు పగటిపూట వెలుగకుండా చూడాలన్నారు. విద్యుత్ బిల్లులు తగ్గించేలా సోలార్ దీపాల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కుంటపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కమ్యూనిటీ లైబ్రరీలను సందర్శించి పరిశీలించారు. ఎంపీడీఓ కాసర్ల రవీందర్, పంచాయతీ కార్యదర్శులు వాజీద్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తు చేసుకోవాలి

కాళోజీ సెంటర్: విదేశాల్లో ఉన్నత విద్యనభ్యసించాలనుకునే పేద ఎస్సీ విద్యార్థులు అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకం కోసం ఈనెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.భాగ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద కుటుంబంలో ఒకరికి మాత్రమే రూ.20 లక్షల స్కాలర్‌షిప్ మంజూరు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

### 174 మందికి పోస్టింగ్



కాళోజీ సెంటర్: జిల్లాలో డీఎస్సీ–2024 ద్వారా నియమితులైన వివిధ కేటగిరీలకు చెందిన 174 మంది ఉపాధ్యాయులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. జెడ్పీ హాల్‌లో పాఠశాలలను కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేసినట్లు డీఈఓ మామిడి జ్ఞానేశ్వర్ తెలిపారు. సోషల్ స్టడీస్‌లో 18 మంది, ఎస్జీటీ (ప్రభుత్వ) 12, ఎస్జీటీ (లోకల్ బాడీ)లో 144 మంది కలెక్టర్ సత్య శారద చేతుల మీదుగా పోస్టింగ్ ఆర్డర్స్ తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు.

### యువతకు ఉచిత శిక్షణ

వరంగల్: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీయువకులకు రెండు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పీసీసీఆర్ డైరెక్టర్ లక్ష్మి బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. అకౌంట్స్ అసిస్టెంట్ (ట్యాలీ)లో రెండు నెలల శిక్షణకు బీకాం ఉత్తీర్ణత, బేసిక్ కంప్యూటర్స్ (డాటా ఎంట్రీ ఆపరేటర్) రెండు నెలల శిక్షణకు ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణత, ఆటోమొబైల్–2 వీలర్ సర్వీసింగ్‌లో రెండు నెలల శిక్షణకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ప్రత్యేక వసతి ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్, స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ, యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలో వేర్వేరుగా శిక్షణ తరగతులు ఉంటాయని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28న ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలని, వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

### లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలి



నర్సంపేట రూరల్: లార్వా దశలోనే దోమలను నిర్మూలించాలని వైద్య, ఆరోగ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య అన్నారు. భానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నాగుర్లపల్లి గ్రామంలో బుధవారం దోమల నివారణ చర్యలు చేపట్టారు. పలు ఇళ్లలో దోమల మందు పిచికారీ చేసి, నిల్వ ఉన్న మురుగునీటిని తొలగించారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య నాగుర్లపల్లి గ్రామాన్ని సందర్శించి వైద్య సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. వ్యాధులపై తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ఇంకా పూర్తిస్థాయిలో అదుపులోకి రాలేదన్నారు. సబ్ యూనిట్ మలేరియా అధికారి నంద, హెచ్ఈఓ అజయ్‌కుమార్, ల్యాబ్ టెక్నీషియన్ మురళి పాల్గొన్నారు.

# పల్లెల్లో రేషన్ కష్టాలు



● ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు అజ్మీరా తార. దుగ్గొండి మండలం రాజ్యాతండా గ్రామం. ఇంట్లో భర్త, ముగ్గురు పిల్లలు కలిపి ఐదుగురు సభ్యులు ఉంటారు. నిరుపేద కుటుంబం. ప్రతినెల 30 కిలోల బియ్యం వస్తాయి. తండాలో రేషన్ షాపు లేకపోవడంతో తండాకు మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న అడవిరంగాపురం వెళ్లి బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోంది. అడవిరంగాపురానికి వెళ్లి బియ్యం తీసుకుని వచ్చే సరికి కూలి సమయం దాటిపోతుంది. దీంతో ఇంటివద్దనే ఉండాల్సి వస్తుంది. ఒక్కోసారి అక్కడ డీలర్ అందుబాటులో లేకుంటే ఇంటికి రావాల్సిందే. ఇలా ప్రతి నెల బియ్యం తెచ్చుకోవడానికి తార నానా ఇబ్బందులు పడుతోంది. తండాలోనే రేషన్ దుకాణం ఉంటే అరగంటలో బియ్యం తెచ్చుకుని కూలి పనులకు వెళ్లేది. ఈ పరిస్థితి ఒక్క అజ్మీరా తారదే కాదు. జిల్లా వ్యాప్తంగా రేషన్‌షాపులు లేని గిరిజన తండాలు, చిన్న చిన్న గ్రామాల ప్రజలది.

**దుకాణాలు లేని గ్రామాల సంఖ్య 92**

- నరుకులు తెచ్చుకోవడానికి ఇబ్బందులు
- షాపులు ఏర్పాటు చేయాలని ప్రజల విజ్ఞప్తి
- జిల్లాలో 2,66,662 రేషన్ కార్డులు.. 519 షాపులు

దుగ్గొండి: జిల్లాలోని 11 గ్రామీణ మండలాల్లో 325 గ్రామాలు ఉన్నాయి. వరంగల్ నగరంలో 158 రేషన్‌షాపులు, గ్రామాల పరిధిలో 361 రేషన్ షాపులు కలిపి మొత్తం 591 ఉండగా.. 2,66, 662 రేషన్ కార్డులు ఉన్నాయి. పెద్ద గ్రామాల్లో మూడు షాపులు, చిన్న గ్రామాల్లో ఒకటి చొప్పున అధికారులు రేషన్ షాపులు ఏర్పాటు చేశారు. 92 గ్రామాల్లో రేషన్ షాపులే లేవు. ఆ గ్రామాల ప్రజలు పక్క గ్రామాలకు వెళ్లి రేషన్ తెచుకుంటున్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీల్లో నేటికీ అక్కడ రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయలేదు. దుగ్గొండి మండలంలో మల్లిపల్లి, గిర్నిబావి, పీజీతండా, రాజ్యాతండా, శివాజీనగర్, స్వామిరావుపల్లి, గుడిమహేశ్వరం, బిక్కాజిపల్లి గ్రామాలతోపాటు మిగిలిన మండలాల్లోని మరికొన్ని గ్రామాల్లో రేషన్ షాపులే లేవు. దీంతో ప్రజలు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి సమీప గ్రామాలకు వెళ్లి రేషన్ సరుకులను తెచ్చుకుంటున్నారు. తమ గ్రామాల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.



అడవిరంగాపురం నుంచి బియ్యాన్ని సంచుల్లో ఎత్తుకొని వస్తున్న రాజ్యాతండా గిరిజనులు

**రేషన్ షాపు ఏర్పాటు చేయాలి..**



మాది మల్లిపల్లి గ్రామం. ఇక్కడ 1,208 మంది ఓటర్లు ఉన్నారు. 1,518 జనాభా ఉంది. 520 రేషన్ కార్డులు ఉన్నాయి. మేము రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న మహ్మదాపురం గ్రామానికి వెళ్లాల్సివస్తోంది. 20 ఏళ్లుగా రేషన్ సరుకులు తెచ్చుకోవడానికి అష్టకష్టాలు పడుతున్నాం. ముసలివాళ్లు, అనారోగ్యం బారినపడినవారు, దివ్యాంగులు రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మా గ్రామంలో నూతనంగా రేషన్ షాపు ఏర్పాటు చేయాలి.

- ద్యాగం శివాజీ

**రెండు గ్రామాలకు వెళ్లాలి..**



మాది గిర్నిబావి గ్రామం. 797 మంది ఓటర్లు ఉన్నారు. 437 రేషన్‌కార్డులు ఉన్నాయి. రేషన్ కోసం నానా అగచాట్లు పడుతున్నాం. వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారికి రెండు వైపులా గ్రామం ఉంది. రహదారికి దక్షిణం వైపు ఉన్న వారు రేషన్ బియ్యం కోసం 3 కిలోమీటర్ల దూరంలోని మందపల్లికి, ఉత్తరం వైపు వీధి వారు రెండు కిలోమీటర్ల దూరంలోని తొగర్రాయికి వెళ్లాలి. గిర్నిబావి గ్రామపంచాయతీ అయిందని సంతోషించాం. అయినా నేటికీ రేషన్ బియ్యం తెచ్చుకోవడానికి ఇబ్బంది పడుతున్నాం. రేషన్ దుకాణం ఏర్పాటు చేసి ప్రజలకు న్యాయం చేయాలి.

- పెండ్లి సుజాత, ఐకేపీ వీఓఏ

**ఉన్నతాధికారులకు నివేదించాం..**



దుగ్గొండి మండల పరిధిలోని 8 గ్రామాల్లో రేషన్ షాపులు లేవు. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులను నా దృష్టికి తెచ్చారు. విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదించా. వారి ఆదేశాల మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుంది. అంతవరకు ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపడతాం.

- రవిచంద్రారెడ్డి, తహసీల్దార్

# మద్యం అమ్మకాల జోరు!

- దసరాకు రెండు రోజుల్లో రూ.11.43 కోట్ల ఆదాయం
- జిల్లాలో మూడు ఎక్సైజ్ స్టేషన్లు.. 63 వైన్స్

సాక్షి, వరంగల్: దసరా పండుగ నేపథ్యంలో జిల్లాలో మద్యం ఏరులై పారింది. మద్యం అమ్మకాలు.. తగ్గేదేలే అన్నట్లు జోరుగా సాగాయి. ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు మద్యం విక్రయాల ద్వారా రూ.31.69 కోట్ల ఆదాయం వస్తే.. 10, 11 తేదీల్లో రూ.11.43 కోట్లు రావడం గమనార్హం. అంటే దాదాపు 40 శాతం ఆదాయం ఆ రెండు రోజుల్లోనే సర్కారు ఖజానాలో వచ్చి చేరింది.

**బీరు.. జోరు**

జిల్లాలోని వర్ధన్నపేట, పరకాల, నర్సంపేటలోని ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 63 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు ఎక్కువగా బీర్లు అమ్ముడుపోయాయి. 700,668 బీర్లు లాగిస్తే.. దసరా పండుగ వేళ రెండు రోజుల్లో 2,16,804 బీర్లు తాగారు. అలాగే, 3,36,612 లిక్కర్ కేసులు అమ్ముడవగా.. వీటిలో 1,24,512 కేసులు 10,11 తేదీల్లోనే విక్రయించారు. రానున్న కాలంలో ఎండ తీవ్రత పెరగనుండడంతో బీర్లు ఎక్కువగా అమ్ముడయ్యే అవకాశం ఉందని ఎక్సైజ్ అధికారులు అంటున్నారు.



**ఈ నెల ఒకటి నుంచి 15 వరకు అమ్మకాల వివరాలు..**

| | |
|---|---|
| లిక్కర్ కేసులు | : 28,051 |
| బీరు కేసులు | : 58,389 |
| ఆదాయం | : రూ.31.69 కోట్లు |
| **10, 11 తేదీల్లో విక్రయాలు..** | |
| లిక్కర్ కేసులు | : 10,376 |
| బీరు కేసులు | : 18,067 |
| ఆదాయం | : రూ.11.43 కోట్లు |

# సమస్యలు తెలుసుకునేందుకే పొలంబాట

- ట్రాన్స్‌కో వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు

దుగ్గొండి: విద్యుత్ సమస్యలు తెలుసుకోవడానికి ట్రాన్స్‌కో పొలం బాట చేపట్టినట్లు వరంగల్ ఎస్ఈ మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని తొగర్రాయి గ్రామంలో ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో బుధవారం విద్యుత్ శాఖ– పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఎస్ఈ మధుసూదన్‌రావు రైతుల పంట చేలలోకి వెళ్లి విద్యుత్ సరాఫరా ఎలా ఉంటుంది, లోవోల్టేజీ ఏమైనా ఉందా, ట్రిప్పు అవుతుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన సర్వీస్ వైరు వాడాలని, విద్యుత్ మోటార్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకుంటే నాణ్యమైన విద్యుత్ అందడంతో పాటు మోటార్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయని తెలిపారు. ఐఎస్ఐ మోటార్లు, పైపులు వాడాలని, ఇంటి వద్ద తప్పనిసరిగా ఎర్తింగ్ చేసుకోవాలని, బట్టలు ఆరవేయడానికి ఇనుప తీగలను వాడకూడదని సూచించారు. వ్యవసాయ మోటార్ల వద్ద ఆటోమెటిక్ స్టార్టర్లు వాడడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లపై ఒత్తిడి ఎక్కువగా పెరిగి కాలిపోతాయని, అందుకే ఆటోమెటిక్ స్టార్టర్లు వెంటనే తొలగించాలని కోరారు. ఆయన వెంట డీఈ శ్రీదర్, ఏడీ లక్ష్మణ్, లైన్ ఇన్‌స్పెక్టర్ అజీంపాషా, లైన్‌మన్ అజయ్, విద్యుత్ సిబ్బంది, రైతులు ఉన్నారు.



తొగర్రాయిలో పంట పొలాల వద్ద రైతులతో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఈ మధుసూదన్‌రావు

# మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్

చెన్నారావుపేట: మత్స్యకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని కోపాకుల చెరువులో బుధవారం ఆయన చేప పిల్లలను పోశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చైర్మన్ మాట్లాడుతూ ముదిరాజ్‌లు ఆర్థికంగా బలోపేతం కావడానికి ప్రభుత్వం చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. కోపాకుల చెరువులో లక్ష చేప పిల్లలను పోసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు భూక్య గోపాల్ నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు విజేందర్, వీరారెడ్డి, మండల ఉపాధ్యక్షులు నన్నెబోయిన రమేశ్, నాయకులు రాజు, మంచాల సదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దన రమేశ్, కత్తి కిరణ్‌గౌడ్, చెన్నారెడ్డి, మురళి, బండి హరీశ్, బొంత శ్రీను, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చింతకాయల నరేందర్, కార్యదర్శి వరంగంటి సంతోష్ ఉన్నారు.



కోపాకుల చెరువులో చేప పిల్లలు పోస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్

# 20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- 8 వాహనాలు స్వాధీనం
- 9 మందిపై కేసు నమోదు

నెక్కొండ: రైస్ మిల్లులో విక్రయించేందుకు తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులతో కలిసి అప్పల్‌రావుపేట గ్రామంలోని కనకదుర్గ రైస్ మిల్లుపై బుధవారం దాడులు చేశామన్నారు. తనిఖీలు చేస్తుండగా రామన్నకుంట తండా జీపీకి చెందిన పలువురు టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోటారు సైకిళ్లపై విక్రయించేందుకు రేషన్ బియ్యాన్ని మిల్లుకు తీసుకొచ్చారు. దీంతో విచారణ చేసి వారి నుంచి రూ.52 వేల విలువైన 20 క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు 8 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని ఆయన పేర్కొన్నారు. రేషన్ బియ్యం దందాకు పాల్పడుతున్న మిల్లు యజమాని గోనె ఆనంద్‌తోపాటు లబ్ధిదారుల నుంచి కొనుగోలు చేసి మిల్లుకు తరలిస్తున్న బానోత్ నెహ్రూ, విజయ్, తిరుపతి, సురేశ్, గుగులోత్ గణేశ్, రవి, శ్రీను, వెంకన్నపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపిస్తున్న పోలీసులు

# అభివృద్ధిని పరిశీలించిన ఎన్ఐఆర్డీ పీజీ విద్యార్థులు

సంగెం: గీసుకొండ మండలంలోని గంగదేవిపల్లి, మరియపురం, కోనాయమాకుల గ్రామాలను హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్డీ) పీజీ మొదటి సంవత్సరం విద్యార్థులు బుధవారం సందర్శించారు. లైవ్లీ హుడ్ అనాలసిస్ ప్రోగ్రాంలో భాగంగా ఘనా, మారీషస్, బంగ్లాదేశ్ దేశాలతోపాటు దేశంలోని కేరళ, ఆంధ్రప్రదేశ్, బీహార్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, తెలంగాణ, మహారాష్ట్రకు చెందిన 22 మంది పీజీ మొదటి సంవత్సరం విద్యార్థుల బృందం పర్యటిస్తున్నది. మూడు రోజులు ఆయా గ్రామాల్లోని పలు అభివృద్ధి పనులు పరిశీలించనున్నట్లు ఎన్ఆర్డీ ప్రతినిధి నిమ్మల శేఖర్ తెలిపారు. సందర్శనకు వచ్చిన విద్యార్థుల బృందానికి జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, పంచాయతీ కార్యదర్శులు సరిత, సునీత, హేమలత స్వాగతం పలికారు. గ్రామ అభివృద్ధి, గ్రామ కమిటీల గురించి వివరించారు.



ఎన్ఐఆర్డీ విద్యార్థులకు గంగదేవిపల్లి గ్రామ అభివృద్ధి గురించి వివరిస్తున్న జిల్లా శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి

# యువ క్రీడాకారులకు ప్రోత్సాహం

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

రామన్నపేట: గ్రామీణస్థాయి యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నవంబర్‌లో సీఎం కప్ పోటీలు నిర్వహించనుందని కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. సీఎం కప్ క్రీడోత్సవాల క్రీడాజ్యోతి ర్యాలీ బుధవారం వరంగల్‌కు చేరుకుంది. వరంగల్‌లోని పోచమ్మమైదాన్ వద్ద కలెక్టర్ సత్య శారద, డీసీపీ రవీందర్ ర్యాలీకి ఘన స్వాగతం పలికారు. అనంతరం పోచమ్మమైదాన్ నుంచి ఎంజీఎం మీదుగా వేయిస్తంభాల దేవాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీఎం కప్‌పై చైతన్యం కల్పించి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి ఎక్కువ క్రీడాకారులు క్రీడల్లో పాల్గొనే విధంగా అవగాహన కల్పించడమే ర్యాలీ ముఖ్య ఉద్దేశమన్నారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీసీపీ షేక్ సలీమా, జిల్లా యువజన క్రీడల అధికారి సత్యవాణి, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్యాట్రన్ వరద రాజేశ్వర్‌రావు, జనరల్ సెక్రటరీ కైలాశ్‌యాదవ్, పెట్లా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, కార్యదర్శి రఘువీర్ పాల్గొన్నారు.

**సకాలంలో వైద్య సేవలందించాలి**

వర్ధన్నపేట: ప్రజలకు సకాలంలో వైద్య సేవలందించాలని కలెక్టర్ సత్య శారద ఆదేశించారు. మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫార్మసీ దగ్గరికి వెళ్లి రోగులకు అందించే మెడిసిన్ వివరాలు తెలుసుకున్నారు. మందుల గడువు తేదీని స్వయంగా పరిశీలించారు. రోగులకు మందులు అందుబాటులో ఉన్నాయా అని ఆరా తీశారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వార్డుల్లో పలువురితో మాట్లాడారు. ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. హాజరు పట్టికను పరిశీలించి వైద్యులు, సిబ్బంది, నిర్వహణ తదితర అంశాలపై సమగ్ర నివేదిక అందించాలని సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. వైద్యులు విధుల మధ్యలోనే వెళ్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ జోనా, తహసీల్దార్ విజయ్‌సాగర్ నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అదేవిధంగా ఆస్పత్రి వద్ద ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేసి, అందులోని ఫిర్యాదులు నేరుగా తనకు అందేలా చర్యలు తీసుకునే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నిర్లక్ష్యం వీడి పేద ప్రజల కోసం వైద్యులు, సిబ్బంది పనిచేయాలని చెప్పారు. త్వరలో మరోసారి సందర్శనకు వచ్చి ఆస్పత్రిని గాడిన పెట్టేవిధంగా చర్యలు తీసుకుంటానని స్పష్టం చేశారు.

**భూసమస్య పరిష్కరించాలి..**

కలెక్టర్ వచ్చారని తెలుసుకున్న మండలంలోని ఇల్లంద గ్రామానికి చెందిన నాంపల్లి కుమారస్వామి ఆస్పత్రి వద్దకు చేరుకున్నాడు. రెండు సంవత్సరాలుగా భూ సమస్యతో ఇబ్బందులు పడుతున్నానని, రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి వేసారి పోయానని కలెక్టర్ ఎదుట వాపోయాడు. తన భూమి సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని రెండు సంవత్సరాల క్రితం చలాన్ కట్టినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశాడు. తన సమస్యను పరిష్కరించాలని కోరాడు. త్వరలో సమస్యను పరిష్కరిస్తానని కలెక్టర్ ఆయనకు హామీ ఇచ్చారు.



రామన్నపేట: సీఎం కప్ ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ సత్య శారద, అధికారులు



వర్ధన్నపేట: ఫార్మసిస్టు, వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

## విద్యుత్ వినియోగదారుల సమస్యలు పరిష్కరించాలి



సమస్యల పరిష్కార వేదికలో మాట్లాడుతున్న చైర్మన్ ఎన్వీ.వేణుగోపాలాచారి

దుగ్గొండి: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక చైర్మన్ ఎన్వీ.వేణుగోపాలాచారి సూచించారు. గిర్నిబావిలోని సబ్‌స్టేషన్ ఆవరణలో బుధవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దుగ్గొండి, నల్లబెల్లి, నర్సంపేట మండలాలకు చెందిన పలువురు వినియోగదారులు తమ సమస్యలను వేదిక సభ్యులకు వివరించారు. అనంతరం వేణుగోపాలాచారి మాట్లాడారు. విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపాలని అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ మధుసూదన్, డీఈ శ్రీధర్, ఏడీ లక్ష్మణ్, శ్రీధర్, రాజేశ్, నర్సంపేట డివిజన్ పరిధిలోని ఏఈలు, సబ్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్గత పోరు.. ఎటువైపు?

**ఆసక్తికరంగా ఓరుగల్లు కాంగ్రెస్ రాజకీయాలు**

- మంత్రి కొండాపై రాష్ట్ర పెద్దలకు ఎమ్మెల్యేల ఫిర్యాదు
- పంచాయితీ తేల్చేందుకు ఓ ముఖ్యనేతకు బాధ్యతలు

సాక్షి, వరంగల్: ఉమ్మడి వరంగల్ కాంగ్రెస్ పార్టీలో 'కొండ'ంత మంటలు రగులుతున్నాయి. మంత్రి కొండా సురేఖ వ్యవహార శైలిపై కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్‌మున్షీకి మంగళవారం ఉమ్మడి జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు, ఓ ఎమ్మెల్సీ ఫిర్యాదు చేయగా, తాజాగా బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్‌ను కలవడం ఆ పార్టీలో హాట్‌టాపిక్‌గా మారింది. తమ నియోజకవర్గాల్లో తన మద్దతుదారులకు ప్రధాన ఆలయ కమిటీ నియామకాల్లో అందలం వేస్తున్నారని, సమయం, సందర్భం లేకుండా అన్ని విషయాల్లో కలగజేసుకుంటూ ఇబ్బంది పెడుతున్నారని ఫిర్యాదు చేశారన్న వార్తలతో కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పోరు తారస్థాయికి చేరినట్లయ్యింది. ఇప్పటికే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేసే క్రమంలో సినీహీరో అక్కినేని నాగార్జున కుటుంబాన్ని కార్నర్ చేయడంతో విమర్శలు ఎదుర్కొన్న కొండా సురేఖ.. ఇప్పుడు పరకాల నియోజకవర్గం గీసుకొండ మండలంలో ఫ్లెక్సీ వివాదంలో ఏకంగా ఠాణాకు వెళ్లి హల్‌చల్ చేశారు. దీంతో సొంత పార్టీ ఎమ్మెల్యేల నుంచే వ్యతిరేకత ఎదుర్కొంటుండడం జిల్లా రాజకీయాల్లో సంచలనంగా మారింది. తమ నియోజకవర్గాల్లో మంత్రి కొండా సురేఖ కలగజేసుకుంటూ ఇబ్బందులు సృష్టిస్తున్నారంటూ ఎమ్మెల్యేలు పార్టీ అధిష్టానం ముందు పెట్టి కొండాకు బ్రేక్ వేసేలా ముందుకెళ్తున్నారని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే మంత్రిపై ఫిర్యాదు చేసిన ఉమ్మడి వరంగల్ ఎమ్మెల్యేలతో, ఆ తర్వాత మంత్రితో సమావేశమై అసలు కారణాలు తెలుసుకునేందుకు ఓ రాష్ట్ర మంత్రికి బాధ్యతలు అప్పగించినట్టుగా చర్చ సాగుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ముందున్న వేళ కాంగ్రెస్ పార్టీని సమన్వయం చేస్తారా లేదా పార్టీకి ఇబ్బంది కలిగిస్తున్న వారి విషయంలో కఠినంగా వ్యవహరిస్తారా అని హస్తం పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. దీంతో వరంగల్ వేదికగా కాంగ్రెస్ పార్టీ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి.

## ట్రెయినీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లకు శిక్షణ



ట్రెయినీ బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్న వంశీకృష్ణ

**గోవిందరావుపేట:** శిక్షణ నిమిత్తం తెలంగాణ ఫారెస్ట్ అకాడమీ నుంచి 33 మంది ట్రెయినీ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు బుధవారం మండలంలోని లక్నవరం చేరుకున్నారు. ఈ సందర్భంగా పస్రా ఫారెస్ట్ రేంజర్ మాధవీశీతల్ ఆధ్వర్యంలో ఎఫ్‌బీఓ ట్రెనీ కోఆర్డినేటర్, దూలపల్లి రేంజర్ ఎం.వంశీకృష్ణ శిక్షణ ఇచ్చారు. శిక్షణలో భాగంగా 8 కిలోమీటర్లు ట్రెక్కింగ్, క్యాంపింగ్ సైట్, తూముల ఏరియా, ఎకో పార్క్‌లను తిప్పారు. లక్నవరం అడవుల్లోని వివిధ చెట్లను చూపించి వాటి గురించి క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో పస్రా రేంజ్ స్టాఫ్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ వేణుగోపాల్ రెడ్డి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ టి. దీప్‌లాల్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టిజన్లుగా గుర్తించాలి

**హన్మకొండ :** విద్యుత్ సంస్థల్లో మిగతా కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టిజన్‌లుగా గుర్తించాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్స్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ కె.ఈశ్వర్ రావు, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేశ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల్లో 23,667 మందిని మాత్రమే ఆర్టిజన్‌లుగా సంస్థల్లోకి తీసుకున్నారని, ఇంకా 19,587 మంది మిగిలారని వారు బుధవారం ఒక ప్రకటనలో వివరించారు. వీరిని ఆర్టిజన్‌లుగా గు ర్తించాలని కోరుతూ ఈ నెల 17వ తేదీన హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు ఎన్పీడీసీఎల్ పరిధిలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.

## పాడి పత్తికి గరిష్ఠ ధర

**వరంగల్:** వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు పాడి పత్తిని తీసుకువచ్చి రైతులు అత్యధిక ధర పొందాలని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల బుధవారం ఒక ప్రకటనలో కోరారు. పత్తిని నీళ్లు చల్లి తీసుకురావొద్దని, తడి ఎక్కువ ఉంటే పత్తి నాణ్యత దెబ్బతింటుందన్నారు. పత్తి రంగు మారి గింజలు బూజు పట్టి నాణ్యత పడిపోయి గింజల నుంచి నూనె తక్కువ వస్తుందన్నారు. అందుకే వ్యాపారులు తక్కువ ధర చెల్లించే అవకాశాలున్నాయన్నారు. పాడి పత్తి తీసుకొచ్చి అధిక ధర పొందాలని రైతులకు సూచించారు.

## క్షణికావేశంలో యువకుడి ఆత్మహత్య



కుమార్ (ఫైల్)

**కేసముద్రం:** తండ్రి బైక్ కొనివ్వలేదనే క్షణికావేశంలో ఓ యువకు డు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు కథనం ప్రకా రం..గ్రామానికి చెందిన కాడబోయిన శ్రీనుకు ఇద్ద రు కుమారులున్నారు. చిన్న కుమారుడు కుమార్(24) ఇంటర్ పూర్తిచేసి ఇంటి వద్దే ఉంటూ వ్యవసా య పనులు చేస్తున్నాడు. ఈక్రమంలో ఈనెల 14న అన్నకు బైక్ ఉంది, నాకు కూడా కొనివ్వాలని తండ్రి ని అడిగాడు. దీంతో పంట డబ్బులు వచ్చాక కొని స్తానని తండ్రి చెప్పాడు. తనకు ఎలాగైనా బైక్ కొని వ్వాలంటూ కుమార్ గొడవ పడి బయటకు వెళ్లిపోయాడు. అదే రోజు మధ్యాహ్న సమయంలో తాను గుంటిచెరువు వద్ద పురుగుల మందు తాగానంటూ తన అన్నకు ఫోన్ చేసి చెప్పాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన వెళ్లి చూడగా కుమార్ అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే మానుకోటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై మురళీధర్ రాజు తెలిపారు.






# విభజన.. విస్మరింపు

**స్వీపర్, వాచ్‌మెన్ పోస్టుల బైఫర్‌కేషన్ ఎప్పుడో?**
- విద్యుత్ ఉద్యోగుల పదోన్నతి, బదిలీలు పూర్తి
- పూర్తి కాని కిందిస్థాయి పోస్టుల విభజన
- పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తున్న వైనం



ప్రతి ప్రభుత్వ శాఖ, ప్రభుత్వ రంగ సంస్థ కార్యాలయాలకు స్వీపర్లు, వాచ్‌మెన్‌లు ఉంటారు. స్వీపర్లు కార్యాలయాలను శుభ్రం చేస్తారు. నైట్‌వాచ్‌మెన్లు కార్యాలయాలకు కాపలా ఉంటారు. అయితే అధికారులు, ఉద్యోగులకు పదోన్నతి, బదిలీల ప్రక్రియ కొనసాగించిన టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. నూతన కార్యాలయాలకు స్వీపర్లు, వాచ్‌మెన్ల విభజనను విస్మరించింది. ఫలితంగా అధికారులు, ఉద్యోగులు సొంతంగా చందాలు పోగు చేసుకుని ప్రైవేట్‌గా స్వీపర్‌ను నియమించుకుని కార్యాలయాలను శుభ్రం చేయించుకుంటుండగా, మరికొన్ని కార్యాలయాల్లో సొంతంగా ఎవరికి వారు శుభ్రం చేసుకుంటున్నారు.

**హన్మకొండ :** టీజీ ఎన్పీడీసీఎల్‌లో విద్యుత్ ఉద్యోగుల పదోన్నతి, బదిలీల ప్రక్రియ ముగిసింది. అయితే స్వీపర్, వాచ్‌మెన్ పోస్టుల బైఫర్‌కేషన్‌ను మాత్రం యాజమాన్యం, అధికారులు పట్టించుకోలేదు. సాధారణంగా ప్రతి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయంలో కచ్చితంగా స్వీపర్, నైట్‌వాచ్‌మెన్‌ను నియమిస్తారు. కార్యాలయం ఆస్తుల కాపలాకు నైట్‌వాచ్‌మెన్, కార్యాలయాన్ని నిరంతరం శుభ్రంగా ఉంచడానికి స్వీపర్ అవసరం. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన క్రమంలో టీజీ ఎన్పీడీసీఎల్‌లో సర్కిళ్లు, డివిజన్లు, సబ్‌డివిజన్, ఈఆర్‌ఓలు, సెక్షన్ కార్యాలయాల పునర్విభజన జరిగింది. ఈ మేరకు అన్ని స్థాయిల్లోని ఉద్యోగుల విభజన జరగాల్సి ఉండగా స్వీపర్, వాచ్‌మెన్‌లను మినహాయించి మిగతా స్థాయి ఉద్యోగులను సర్కిళ్లు, డివిజన్లు, సబ్ డివిజన్ల వారీగా విభజన చేశారు. ఫలితంగా నూతనంగా ఏర్పాటైన కార్యాలయాల్లో స్వీపర్ లేక కార్యాలయాన్ని శుభ్రం చేసే కరువయ్యారు. నైట్ వాచ్‌మెన్ లేక కార్యాలయాలకు కాపలా లేకుండా పోయింది.

**అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు..**

రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి వరంగల్ జిల్లా (సర్కిల్)లో పాలన సౌలభ్యం కోసం నూతన సర్కిళ్లు, డివిజన్లు, ఈఆర్‌ఓలు, సబ్ డివిజన్లు, సెక్షన్ కార్యాలయాలు ఏర్పాటు చేశారు. ఆయా కార్యాలయాలకు ఇంజనీర్లు, ప్రొవెన్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బందిని సర్దుబాటు చేసి పోస్టింగ్‌లు ఇచ్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. స్వీపర్, నైట్ వాచ్‌మెన్ల విభజనను విస్మరించారు. ఫలితంగా వారు పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో నూతన కార్యాలయాల్లో స్వీపర్లు, వాచ్‌మెన్‌లు లేక అధికారులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన కార్యాలయాల ఏర్పాటు తర్వాత ఉద్యోగుల విభజనకు 2018, జూన్‌లో సర్కిల్ స్థాయి, డివిజన్ల వారీగా ఉద్యోగులను సర్దుబాటు చేసింది. కానీ స్వీపర్, వాచ్‌మెన్‌లను పట్టించుకోలేదు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలో ఇంజనీర్లు, ప్రొవెన్షియల్, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్లను సర్దుబాటు చేశారు. కానీ ఒక్క ఉమ్మడి వరంగల్ సర్కిల్లో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ పోస్టులను పట్టించుకోకుండా వదిలేశారు. ఆ తర్వాత 20022 ఏప్రిల్లో సర్కిల్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్, డ్రైవర్ల విభజన, సర్దుబాటు కోసం ఓ కమిటీ నియమించారు. అదే విధంగా డివిజన్ స్థాయిలో స్వీపర్, వాచ్‌మెన్, లైన్‌మెన్ డ్రైవర్ పోస్టుల విభజన, సర్దుబాటు కోసం మరో కమిటీని నియమించారు. ఈ కమిటీలను నియమించి రెండేళ్ల గడిచినా ఉలుకుపలుకు లేకుండా పోయింది.

**నూతనంగా నాలుగు సర్కిళ్ల ఏర్పాటు**

టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం ఉమ్మడి వరంగల్ జిల్లా (సర్కిల్) పరిధిలో నూతనంగా నాలుగు సర్కిళ్లు ఏర్పాటు చేసింది. హనుమకొండ సర్కిల్ ఆఫీస్ పూర్వ కార్యాలయంగా, నోడల్ కార్యాలయంగా పని చేస్తుండగా, వరంగల్, జనగామ, మహబూబాబాద్ పాటు జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలను కలిపి భూపాలపల్లి సర్కిల్‌ను ఏర్పాటు చేశారు. వీటితో పాటు డివిజన్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలు కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాలకు సబ్ ఇంజనీర్ స్థాయి నుంచి డివిజనల్ ఇంజనీర్ వరకు, జూనియర్ లైన్‌మెన్ నుంచి ఫోర్‌మెన్ వరకు, జూనియర్ అసిస్టెంట్ మంచి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరకు అధికారులు, ఉద్యోగుల విభజన చేసి పోస్టులు మంజూరు చేసి భర్తీ చేసిన యాజమాన్యం.. స్వీపర్, వాచ్‌మెన్ పోస్టుల విభజనను పట్టించుకోకపోవడాన్ని విద్యుత్ అధికారులు, ఉద్యోగులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నూతన కార్యాలయాలకు స్వీపర్, నైట్ వాచ్‌మెన్లను నియమించాలని వారు యాజమాన్యాన్ని కోరుతున్నారు.

## రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలి

- దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ
- మేడారంలో వనదేవతలకు మొక్కుల చెల్లింపు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న మంత్రి కొండా సురేఖ, మురళీధర్ దంపతులు

**ఎస్ఎస్ తాడ్వాయి:** మేడారం సమ్మక్క, సారలమ్మల ఆశీస్సులతో రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనించాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. బుధవారం మేడారం సమ్మక్క, సారలమ్మలను మంత్రి కొండా సురేఖ, మురళీధర్ దంపతులతో పాటు వారి కూతురు సుస్మిత పటేల్, అల్లుడు అభిలాష్, మనవడు శ్రీయాష్ మురళీకృష్ణ పటేల్‌తో కలిసి అమ్మవార్లను దర్శించుకుని నిలువెత్తు బంగారం మొక్కులు సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించే వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం పట్టు వదలదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం ఫిబ్రవరిలో జరిగిన జాతరను దిగ్విజయంగా పూర్తి చేసిందని గుర్తు చేశారు. దేవాదాయ శాఖ మంత్రిగా తాను, గిరిజన ఆడబిడ్డ, మంత్రి సీతక్క జాతర ప్రాంత అభివృద్ధి కోసం, సౌకర్యాల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రం ప్రగతి బాటలో పయనించాలని, రాష్ట్ర ఆర్థిక కష్టాలు గట్టెక్కాలని అమ్మవార్లను వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీసీ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ సునీత, తహసీల్దార్ రవీందర్, ఈఓ రాజేంద్రం, డీఈ రమేశ్, ఇన్‌స్పెక్టర్ కవిత, సూపరింటెండెంట్ క్రాంతికుమార్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు కాక వెంకటేశ్వర్లు, సిద్ధబోయిన మునీందర్, కాక కిరణ్ పాల్గొన్నారు.

## రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- కేయూ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి



దీక్ష చేస్తున్న ప్రైవేట్ యాజమాన్యాలు

**హన్మకొండ:** ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని కాకతీయ యూనివర్సిటీ ప్రైవేట్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉపేందర్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ వేణుమాధవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూడేళ్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మూడు రోజుల నుంచి ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల బంద్ పాటిస్తున్న యాజమాన్యాలు బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద శాంతి దీక్ష చేపట్టారు. అనంతరం ఇక్కడి నుంచి సుబేదారిలోని హనుమకొండ కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం నవంబర్‌లో విడుదల చేసిన టోకెన్ నంబర్లకు సంబంధించిన రూ.600 కోట్ల బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని కోరారు. లేని పక్షంలో కళాశాలల నిరవధిక బంద్ కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో టీపీడీఎంఏ సభ్యులు శ్రీధర్ రావు, రవీంద్రనాథ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, గోలి వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

## బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ నేషనల్ అవార్డు



బాలిరెడ్డిని సన్మానిస్తున్న మరియపురం గ్రామస్తులు

**సంగెం:** వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం మరియపురం మాజీ సర్పంచ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లం బాలిరెడ్డి జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా ఎంపికయ్యారు. తిరుపతికి చెందిన అకాడమీ ఆఫ్ గ్రాస్ రూట్స్ స్టడీస్ అండ్ రీసెర్చ్ ఆఫ్ ఇండియా (అగ్రసీ) సంస్థ రాజీవ్‌గాంధీ గ్రామ్ స్వరాజ్ నేషనల్ అవార్డు 2023కు బాలిరెడ్డిని ఎంపిక చేసింది. ఈ సంస్థ ప్రతి ఏడాది దేశంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ఆరుగురిని ఎంపిక చేసి అవార్డు అందజేస్తుంది. 2022–23 ఏడాదిలో అందించిన సేవలను గుర్తించి జాతీయస్థాయిలో ఉత్తమ సర్పంచ్‌గా బాలిరెడ్డిని ఎంపిక చేసినట్లు అగ్రసీ సంస్థ చైర్ పర్సన్ డి. భారతీసుందర్ లేఖను పంపించినట్లు బాలిరెడ్డి తెలిపారు. ఈ నెల 17వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో బాలిరెడ్డికి రాజీవ్‌గాంధీ గ్రామ్ స్వరాజ్ నేషనల్ అవార్డును అందజేయనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం మరియపురం గ్రామస్తులు బాలరాజు, మోహన్, జితేందర్, విజయ, స్వాతి తదితరులు బాలిరెడ్డిని ఘనంగా సన్మానించారు.

## నాసిరకం విత్తనాలతో నష్టం

- వరికంకులతో సొసైటీ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన



వరికంకులతో ఆందోళన చేస్తున్న రైతులు

**కురవి:** నాసిరకం విత్తనాలతో కాలవ్యవధికి ముందే వరి పంట చేతికొచ్చిందని ఆరోపిస్తూ పలువురు రైతులు బుధవారం మహబూబాబాద్ జిల్లా కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజి)లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. వారి కథనం ప్రకారం.. గుండ్రాతిమడుగు(విలేజి) గ్రామానికి చెందిన రైతులు కుంభం మైసయ్య, కేతం రామన్న, అబ్బగాని సూరయ్య, గాండ్ల లచ్చయ్య, బానోత్ దీప్లా, అజ్మీరా లాలుతోపాటు మరికొందరు రైతులు గ్రామ సొసైటీలో దొడ్డు రకం వరి జేజీఎల్ విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ పంట 125 రోజులకు చేతికొస్తుందని అధికారులు చెప్పగా, 75 రోజులకే కోతకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగానే పంట చేతికిరావడంతో తాలుగా మారిందన్నారు. ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి అయిందని, నాసిరకం విత్తనాలతో నష్టపోయామని తెలిపారు. సొసైటీ అధికారులను అడిగితే తమకేమి సంబంధం లేదని చెబుతున్నారన్నారు. నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలి



కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీతకు వినతిపత్రం అందజేస్తున్న నరేశ్‌కుమార్, ప్రసన్న

**ఎంజీఎం :** నకిలీ వైద్యులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) పబ్లిక్ రిలేషన్ కమిటీ చైర్మన్ నరేశ్‌కుమార్, హెచ్ఆర్‌డీఏ వరంగల్ జిల్లా నాయకుడు దొమ్మాటి ప్రసన్న కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కాలుష్య నియంత్రణ మండలి అధికారి ఆర్.సునీతను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిలీ వైద్యులు ఇష్టానుసారంగా, అశాస్త్రీయంగా ఇచ్చే స్టెరాయిడ్స్, యాంటీబయోటిక్స్ వల్ల ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉందని, వారు పడేసే బయోమెడికల్ వ్యర్థాల ద్వారా పర్యావరణానికి తీవ్ర నష్టంతో పాటు ప్రజారోగ్యం దెబ్బతింటుదన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్రజారోగ్య బలోపేతం దృష్ట్యా ఇలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న నకిలీ వైద్యులుపై కాలుష్య నియంత్రణ మండలి తరపున చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి సునీత స్పందిస్తూ.. నకిలీ వైద్యులు ఇస్టానుసారంగా ఉపయోగించే మందులపై డ్రగ్ కంట్రోల్ అధికారుల సమన్వయంతో కొద్ది రోజుల క్రితం వరంగల్‌లో కేసులు నమోదు చేశామన్నారు. ఇప్పుడు మరోసారి కాలుష్య నియంత్రణ అధికారుల సమన్వయంతో కాలుష్య నివారణ చట్టం ద్వారా కూడా కేసులు నమోదయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు వివరించారు.

## ‘రైల్వే మజ్దూర్’లో యువతకు పెద్దపీట

- యూనియన్ నేతలు శ్రీనివాస్, రవీందర్




మాట్లాడుతున్న జోనల్ ప్రెసిడెంట్ శ్రీనివాస్

**కాజీపేట రూరల్:** సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ యువతకు పెద్దపీట వేస్తోందని ఆ యూనియన్ సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ కాల్వ శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ పి.రవీందర్ అన్నారు. కాజీపేట రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో బుధవారం మజ్దూర్ యూనియన్ యువ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, రవీందర్ మాట్లాడుతూ రైల్వే కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుతున్న యూనియన్‌లో యువత ముఖ్య భూమిక పోషించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ ఖాజాబాబా, కాజీపేట కోఆర్డినేటర్ నాయిని సదానందం, రైల్వే సీసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌యాదవ్, నాయకులు సమ్మయ్య, బచ్చల శ్రీనివాస్, బాలమునిరాజు, యూత్ కోఆర్డినేటర్ ఫారుఖ్,అక్బర్, ఎస్‌కె.జానీమియా, పి.వేదప్రకాశ్, సాయికుమార్, యుగేందర్ పాల్గొన్నారు.

# పరీక్షలకు వేళాయె..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్ఏ–1
- ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు..
- ఈనెల 21 నుంచి 28వ తేదీ వరకు నిర్వహణ



**విద్యారణ్యపురి:** విద్యార్థులకు దసరా సెలవులు ముగిశాయి. ఈనెల 15 నుంచి తరగతులు పునః ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరానికి(2024–2025) సంబంధించి సమ్మిటివ్ అసెస్‌మెంట్ (ఎస్ఏ)–1 పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేసింది. ఈమేరకు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హనుమకొండ, వరంగల్, ములుగు, మహబూబాబాద్, జనగామ, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలో అన్ని యాజమాన్యాల పరిధిలో ఒకటి నుంచి 10వ తరగతి వరకు ఈ పరీక్షలు నిర్వహించబోతున్నారు. ఈమేరకు డీఈఓలు కూడా హెచ్ఎంలకు పరీక్షల నిర్వహణపై ఆదేశాలు జారీచేశారు. టైంటేబుల్ కూడా విడుదల చేశారు. పాఠశాలల్లో విద్యార్థులను అందుకు సన్నద్ధం చేస్తున్నారు.

**టైంటేబుల్..**

ఈనెల 21న ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఫస్ట్‌లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ, ఆరో తరగతి విద్యార్థులకు ఫస్ట్‌లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ, 8,9,10 తరగతుల విద్యార్థులకు మ్యాథ్స్‌మెటిక్స్, ఏడో తరగతికి ఫస్ట్ లాంగ్వేజ్ తెలుగు, ఉర్దూ పరీక్షలు నిర్వహించాల్సింటుంది.

- 22న ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఇంగ్లిష్, ఆరు,ఏడు తరగతుల సెకండ్‌లాంగ్వేజ్ హిందీ, తెలుగు, 8,9,10వ తరగతి విద్యార్థులకు ఫిజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 23న ఒకటి నుంచి 5వతరగతి వరకు మ్యాథ్‌మెటిక్స్, ఆరు, ఏడు తరగతులకు థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్, 8,9,10వ తరగతులకు బయాలజికల్ సైన్స్ పరీక్షలు నిర్వహిస్తారు.
- 24న ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈవీఎస్, 6,7,8,9,10వతరగతి విద్యార్థులకు సోషల్ స్టడీస్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 25న ఆరో తరగతి విద్యార్థులకు మ్యాథ్‌మెటిక్స్, 8,9,10వ తరగతులకు ఫస్ట్‌లాంగ్వేజ్ (తెలుగు, ఉర్దూ), 7వ తరగతి విద్యార్థులకు మ్యాథ్‌మెటిక్స్ పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 26న ఆరు, ఏడో తరగతి విద్యార్థులకు జనరల్ సైన్స్, 8,9,10 తరగతులకు సెకండ్ లాంగ్వేజ్ (హిందీ, తెలుగు) పరీక్షలు నిర్వహించాల్సింటుంది.
- 28న 8,9,10 తరగతుల విద్యార్థులకు థర్డ్ లాంగ్వేజ్ ఇంగ్లిష్ సబ్జెక్టుల పరీక్షలు నిర్వహిస్తారు.

**పరీక్షల సమయం ..**

**➤ ఉదయం..**

ఎస్ఏ–1 పరీక్షలు ఉదయం సెషన్‌లో ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6 8, తరగతుల విద్యార్థులకు ఉదయం 9.15 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆయా తేదీల్లో నిర్వహించాల్సింటుంది,

**➤ మధ్యాహ్నం సెషన్‌లో..**

7,9 తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం సెషన్‌లో నిర్వహిస్తారు. అందులో 7వతరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు 1.15 నుంచి సాయంత్రం 4–15 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు.

# సినీ ఫక్కీలో చోరీ..

- బైక్ ట్యాంక్ కవర్ నుంచి రూ. 3.10 లక్షల అపహరణ
- స్టేషన్ ఘన్‌పూర్‌లో ఘటన
- లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించిన బాధిత రైతు



రోదిస్తున్న బాధితుడు మంద రాజు

**స్టేషన్‌ఘన్‌పూర్:** ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో సినీ ఫక్కీలో చోరీ జరిగింది. రోడ్డు పక్కన నిలిపిన బైక్ ట్యాంక్ కవర్ నుంచి దుండగులు రూ.3.10 లక్షల నగదును అపహరించుకెళ్లారు. పోలీసుల కథనం ప్రకారం.. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటకు చెందిన రైతు మంద రాజు వ్యక్తిగత పనుల నిమిత్తం బుధవారం తన బైక్‌పై ఘన్‌పూర్‌కు వచ్చాడు. ఘన్‌పూర్‌లో వివేకానంద చౌరస్తా వద్ద బరోడా బ్యాంకులో క్రాప్‌లోన్‌కు సంబంధించిన రూ.1.10 లక్షలు తీసుకున్నాడు. అనంతరం ఆంధ్రాబ్యాంకుకు వెళ్లి అందులో హౌసింగ్‌లోన్‌కు సంబంధించిన రూ.2లక్షలు తీసుకున్నాడు. మొత్తం రూ.3.10 లక్షలు నగదు బైక్ ట్యాంక్ కవర్‌లో పెట్టి తిమ్మంపేటకు బయలుదేరాడు. ఈ క్రమంలో తన కుమార్తెకు పుస్తకాలు కొనుగోలు చేసేందుకు కొత్త గాంధీ చౌరస్తా సమీపాన కిరణ్‌బుక్‌స్టాల్ వద్ద రోడ్డు పక్కన బైక్‌ను పార్క్ చేసి బుక్‌స్టాల్‌లోకి వెళ్లాడు. బుక్‌స్టాల్‌లోకి వెళ్తుండగానే అతడిని అనుసరించి వచ్చిన ఇద్దరు దుండగులు.. బైక్ ట్యాంక్ కవర్‌లో ఉన్న డబ్బులు తీసుకుని ఉడాయించారు. గమనించిన రాజు కేకలు వేస్తూ బుక్‌స్టాల్ నుంచి బైక్‌వద్దకు వచ్చేసరికే దుండగులు అక్కడ నుంచి పరారయ్యారు. దుండగుల్లో ఒకరు స్కూటీ నడుపుతుండగా వెనుక ఉన్న వ్యక్తి బైక్ ట్యాంక్ కవర్‌లో నుంచి డబ్బులు తీసుకుని వెళ్లారని బాధితుడు రోదిస్తూ తెలిపాడు. ఈ విషయం తెలుసుకున్న సీఐ జి.వేణు ఘటనాస్థలికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. షాపులు, ఆంధ్రాబ్యాంకు వద్ద సీసీ ఫుటేజీని పరిశీలించారు. నిందితులు బ్యాంకు వద్ద నుంచే రాజును వెంబడించి ఉంటారని భావిస్తున్నారు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వేణు తెలిపారు.

## స్కూటీలోని బంగారం ఉన్న బ్యాగు మాయం..

**భూపాలపల్లి అర్బన్:** బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకొని స్కూటీలో పెట్టుకున్న బ్యాగు మాయమైంది. ఈ ఘటన బుధవారం భూపాలపల్లి పట్టణంలో జరిగింది. సీఐ నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మంజూర్‌నగర్ సమీపంలోని వెయ్యి క్వార్టర్ల కాలనీకి చెందిన సలీంద్ర అరుణ, తన కుమారుడు విజయ్‌కుమార్ పట్టణంలోని యూనియన్ బ్యాంకులో తాకట్టు పెట్టిన 6 తులాల బంగారం విడిపించుకున్నారు. తమ సెల్ ఫోన్, బంగారం హ్యాండ్‌బ్యాగులో పెట్టి స్కూటీ డిక్కీలో భద్రపరిచారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో మార్గమధ్యలో మంజూర్‌నగర్‌లో సోమేశ్వర మెడికల్ షాపులో మెడిసిన్ కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లిన అనంతరం స్కూటీ డిక్కీ తెరిచి చూడగా బ్యాగు కనిపించలేదు. దీంతో లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు.

# తెల్లారితే హాస్టల్‌కు..ఆలోపే అనంతలోకాలకు

**లారీ ఢీకొని విద్యార్థి దుర్మరణం**
- ఇద్దరికి తీవ్రగాయాలు
- పెద్దాపూర్‌లో ఘటన
- ముగ్గురు మైనర్లే..



వెంకటేశ్ (ఫైల్)

**భూపాలపల్లి రూరల్:** మాయదారి మృత్యువు మాటు వేసి కాటు వేసింది. తెల్లారితే హాస్టల్‌కు వెళ్లేవాడు. అంతలోనే వాహన రూపంలో బలి తీసుకుంది. లారీ.. బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం భూపాలపల్లి మండలం పెద్దాపూర్‌లో చోటు చేసుకుంది. ములుగు జిల్లా వెంకటాపురం ఎస్సై సతీశ్, స్థానికుల కథనం ప్రకారం.. గణపురం మండలం జంగుపల్లి గ్రామానికి చెందిన పేరాల వెంకటేశ్ (16), మేముల మణి ప్రసాద్, జక్కిరాజు జశ్వంత్ ద్విచక్రవాహనంపై పెద్దాపూర్ వెళ్తున్నారు. ఈక్రమంలో భూపాలపల్లి నుంచి వెంకటాపురం వైపునకు బూడిద లోడ్‌తో వెళ్తున్న లారీ.. పెద్దాపూర్ శివారులో బైక్‌ను వెనుక నుంచి ఢీకొంది. దీంతో వెంకటేశ్ అక్కడిక్కడే మృతి చెందాడు. వేముల మణి ప్రసాద్, జక్కిరాజు జశ్వంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులను 108లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్ తరలించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు.

**తెల్లారితే హాస్టల్‌కు వెళ్లేవారు..**

మృతుడు వెంకటేశ్ కాటారంలోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి, మణి ప్రసాద్ నర్సంపేటలోని బిట్స్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్, జక్కిరాజు జశ్వంత్ భూపాలపల్లిలోని ఓ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నారు. గురువారం హాస్టళ్లకు వెళ్లే క్రమంలో వీరు కటింగ్ చేయించుకోవడం కోసం జంగుపల్లి నుంచి పెద్దాపూర్ వెళ్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కాగా, రోడ్డు ప్రమాద ఘటన తెలిసిన వెంటనే భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హుటాహుటిన హైదరాబాద్ నుంచి నేరుగా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి చేరుకుని మార్చురీలో ఉన్న వెంకటేశ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.